# గూడు బయట పక్షులు

కొటూరు రవీంద్ర-త్రివిక్రమ్



గోడ గడియారం పదకొండుసార్లు మ్రోగింది.

ఉలిక్కిపడి దానికేసి చూశాడు ఉమాపతి.

'అవును పదకొండే!' అన్నట్లు లోలకం 'టిక్కు టిక్కు' మంటూ ఉత్తర దక్షిణాల మధ్య ఊగిస లాడసాగింది.

ఉమాపతి అప్రయత్నంగా కిటికీలోంచి బయటకి చూశాడు. పదకొండు గంటల వయసున్న రాత్రికి నీరాజనం పడుతోంది వీధి దీపం. వింజామరగా రెక్కలు విసుర్తున్నాయి దీపం పురుగులు.

అతని చూపులు వీధిగేటు మీద పడ్డాయి.

కొడుకు ప్రొద్దున్ననగా వెళ్ళాడు కాలేజీకి. ఇంకారాలేదు. రాక పోవటాలు మామూలై పోతున్నాయి ఈ మధ్య. మందలించి ఓ దెబ్బ వేసి భయపెట్టే రోజులు కావివి. 'పదహారేళ్ళొచ్చిన కొడుకుని మిత్రుడిగా చూడకపోతే ప్రమాదం' అని నీతి సూత్రాలు వల్లిస్తున్నాయి. అందుకే చాలావరకు మౌనంతో అసహనాన్నీ, ఆగ్రహాన్నీ దాచు కుంటున్నాడు.

కానీ ఈ మౌనహింస నిలా ఎన్నాళ్ళు భరించటం?

కొడుకంటే ఏదో మగవాడు. అందులో కాస్త తేడా ఉంది. కానీ కూతురు మాటేమిటి?

దానికి కొత్త సినిమా వచ్చిన రోజున చూడకపోతే గంగవెర్రు లెత్తిపోతుంది. ఈరోజున దాని అభిమాన హీరో నటించిన నూరో చిత్రం విడుదలట.

మరి దానికెలా టికెట్టు దొరుకు తుందో పరమాత్ముడి కెరుక!

"ఆడపిల్లలు అలా వంటరిగా తిరగ్గూడదమ్మా" అంటే చాలు. ఓ పావుగంట తరాలు- అంతరాలమీద లెక్చరిచ్చేస్తుంది. స్కూలు డిబే టింగ్‌లో ఫస్టు ప్రైజు ఎప్పుడూ దానిదే. పైగా 'లాజిక్ స్టూడెంటు' ఇహ చెప్పేదేముంది?

'ఇలా ఇద్దరి మధ్యా నలిగి పోతుండటమే వృద్ధాప్యంలో తనకి మిగిలిందా?....' అని వాపోయాడు ఉమాపతి.

భార్య దాదాపు ఒక యంత్రం. యంత్రం లాగానే తన పనులు తాను చేసుకుపోతుంది. బహు అరుదుగా మాత్రమే మాట్లాడు తుంది. అందువల్ల ఇంట్లో పిల్లలు లేకపోతే భయంకర నిశ్శబ్దం రాజ్య మేలుతుంటుంది.

పిల్లలు ఇద్దరూ చక్కగా చదువుకుని పైకి రావాలని అందరి తండ్రుల్లాగానే తనూ కలలు గన్నాడు.

సకాలంలో కూతురి పెళ్ళి చెయ్యాలని, తన సంపాదనలోంచి ఎప్పటికప్పుడు కొంత వెనకేస్తూ

వచ్చాడు ఎంతో జాగ్రత్తగా.

డబ్బు సిద్ధమయింది!

కానీ పిల్ల రెడీ కాలేదు. ముఖ్యంగా చదువు విషయంగా వెనకబడి ఉంది. ఇంటర్మీడియేట్ అనర్సులోంచి ఇంకా బయట పడలేదు. ఆ కాస్తా అయిందనిపిస్తే పెళ్ళి చేసేద్దామని కూర్చున్నాడు. అప్పటికీ ఊరుకోలేక మిత్రులు, శ్రేయోభిలాషుల ద్వారా సంబంధాలు వాకబు చేస్తూనే ఉన్నాడు

ఎప్పటికి కాలం కలిసి వస్తుందో అర్థం కావటంలేదు.

గేటు చప్పుడయింది.

ఆలోచనల్లోంచి మేలుకుని అటు చూశాడు. కూనిరాగం తీస్తూ వస్తున్న కూతురు.

కళ్ళతోనే 'ఇంకా పడుకోలేదా' అనే భావంతో ఒక చూపు చూసి, కాళ్ళు చేతులు కడుక్కుని, వంటింట్లోకి నడిచింది. వడ్డించటానికి రాబోతున్న తల్లిని చేతుల్తో వారించి కూనిరాగం తీస్తూనే అన్నం వడ్డించుకోసాగింది.

ఉమాపతి పడక్కుర్చీలో వెనక్కివాలి, కాళ్ళు కుర్చీపీట మీద పెట్టుకున్నాడు. అమ్మాయి ఇంటికొచ్చింది గనక కాస్త మనసు తేలిక పడిందతనికి.

మరో అయిదు నిముషాల్లో చెక్క గేటు చప్పుడుతో బాటు ఈల పాట వినిపించింది. అంటే-కొడుకు వచ్చాడన్న సంగతి తల త్రిప్పకుండానే ఉమాపతికి అర్థమై పోయింది.

తండ్రి ఇంకా పడక్కుర్చీలో మెలకువగా ఉండటం గమనించిన సారథి- ఈల మెల్లగా ఆపేసి, నిశ్శబ్దంగా వంటింట్లోకి దూరేడు. అక్కడ చెల్లెలు పద్మతో రాజీపడి అల్లరి లేకుండా నాలుగు మెతుకులు తిన్నాడు.

ఉమాపతి లేచి వీధిగేటు తాళం తీసుకు బయల్దేరాడు.

గేటు మూసి తాళం వెయ్యబోతుండగా రెండు గజాల దూరంలో, మొహం అదోలా పెట్టుకు నిలబడ్డ మిత్రుడు సుందర్రావు కనిపించాడు.

ఆవేళప్పుడు సుందర్రావు ఎందుకొచ్చినట్లు?

అన్నట్లు భార్య ఆస్పత్రిలో ఉందికదా! ఆరోగ్యం ఎలా ఉందో పాపం!

"అలా నిలబడిపోయావేమిట్రా సుందరం?"

"ఓ మాటిలారా! ...." అక్కడే నిలబడి పిలిచాడు.

చప్పున అడుగు బయటికేసాడు ఉమాపతి.

"ఏమిట్రా? మీ ఆవిడకెలా ఉంది? నేను రాలేకపోయాను. క్షమించు!" బాధగా అన్నాడు.

"మా ఆవిడ క్షేమంగా ఉంది గానీ, నేను నీ సంగతే మాట్లాడదామని వొచ్చా."

"నా సంగతేమిటి?" అయోమయంగా చూస్తూ ప్రశ్నించాడు.

"చెప్పేది సావధానంగా విను. ఆవేశపడకు. నీ ఆరోగ్యం అసలే మంచిది కాదు."

ఉమాపతికి ఆ ఉపోద్ఘాతం ఆందోళన కల్గించింది.

విషయం 'సీరియస్' అని అర్థమైపోయింది.

"ఏమిటో చెప్పు." అన్నాడు తడారిపోతున్న పెదవుల్ని తడుపుకుంటూ.

"నీకు ఆప్తమిత్రుడుగా నాకున్న బాధ్యతని పురస్కరించుకుని ఈ విషయాలు చెప్పక తప్పటం లేదు. నీ పిల్లలొకటి, నా పిల్లలు ఒకటీ కాదుగదా?"

"ఇంతకీ విషయం ఏమిటో చెప్పరా?"

"అదుగో- ఆవేశపడుతున్నావ్? అయితే నేను చెప్పను. ఇలాగే వెళ్ళిపోతా."

"నీతో చావొచ్చి పడింది. ఆవేశం లేదు, అధ్వాన్నం లేదు. త్వరగా చెప్పి ఏడవరా? నాకు సస్పెన్సు అంటే వళ్ళు మంట." విసుక్కున్నాడు ఉమాపతి.

"నన్నలా తొందర పెట్టకు. నీకు తెలుసుగా నా సంగతి- ఏదైనా నిదానంగా గానీ చెయ్యనని."

ఉమాపతి పళ్ళ బిగువున నిలబడ్డాడు. సుందరం కొనసాగించాడు.

"ఈ రోజు మీ అమ్మాయి పద్మ 'అప్సర' లాడ్జిలోకి ఎవరో కుర్రాడితో చెట్టాపట్టా లేసుకుని వెళ్ళటం చూశాను. నేను పొరబాటు పడ్డానేమోనని చాదస్తంగా మరీ దగ్గరికి వెళ్ళి నాలుగయిదు మాట్లు చూశాను. పద్మ నన్ను చూసీ చూడనట్లు మొహం తిప్పుకుంది."

ఉమాపతి వంట్లో నెత్తురు చల్లబడినట నిపించింది.

అయిపోయింది- తనిక బ్రతికి ప్రయోజనం లేదు.

"ఇంకో సంగతి కూడా చెప్పక తప్పటం లేదు."

ఏమిటన్నట్లు జీవరహితంగా చూశాడు ఉమాపతి.

"మీ వాడు సుబ్బరాజనే నక్సలైటుతో తిరుగుతున్నాడు. వాడీ మధ్యనే జైల్లోంచి బైటకి వచ్చాడు."

భూకంపం వచ్చిన నేలమీద నిలబడినట్లు కంపించి పోయాడు ఉమాపతి.

"ఒరేయ్! ఏమైందిరా?" అన్నాడు సుందరం కంగారుగా.

మెల్లగా నిలద్రొక్కుకున్నాడు.

"ఏదన్నా అయితే బావుండేది. కాలేదు. అందుకే బాధపడుతున్నాను. సరే- నువ్వెళ్ళిరా" భారంగా ఇంట్లోకి నడిచాడు ఉమాపతి.

చేతిలో గేటు తాళం అలాగే ఉండిపోయింది.

ఇంట్లోకి వచ్చి నిస్సత్తువగా తాళం టేబుల్ మీద పడేశాడు.

పడకుర్చీలో వాలిపోయాడు. సారధి వంటింట్లోంచి మూతి తుడుచుకుంటూ వచ్చి గేటు తాళం బల్లమీదే ఉండటం గమనించి, దాన్నందుకుని వెళ్ళి తాళం వేసొచ్చాడు.

పద్మ వంటిల్లు సర్ది ఇవతలికి వచ్చింది.

"అమ్మాయ్, పద్మా!" హీన స్వరంతో వచ్చిన తండ్రి పిలుపుకి ఆశ్చర్యంగా సమీపించింది. ఉమాపతి దీర్ఘ రోగిలా కళ తప్పి ఉన్నాడు.

"ఏమిటి నాన్నా?" అంది వంటి మీద చెయ్యివేసి చూస్తూ.

"వాడిని కూడా పిలు."

సారధికి ఆ మాట వినిపించి తనే వచ్చాడు.

"కూర్చోండి!" అన్నాడు మెల్లగా.

సారధి కిటికీ అంచు మీద, పద్మ కుర్చీ పీటమీద మెల్లగా కూర్చున్నారు.

"మంచినీళ్ళు!" అన్నాడు మెల్లగా ఉమాపతి.

చప్పున వెళ్ళి గ్లాసుతో నీళ్ళు తెచ్చి ఇచ్చింది పద్మ.

తాగాక సేద తీరాడు.

"అమ్మాయ్! నువ్వివ్వాళ అప్సర హోటల్ కెళ్ళావు కదూ?"

సూటిగా కళ్ళలోకి చూస్తూ అడిగాడు.

తల దించుకుంది పద్మ మౌనంగా.

కొడుకు వైపు చూసి, "నువ్వు నక్సలైటు సుబ్బరాజుతో తిరుగుతున్నావు కదూ?" ఉమాపతి అన్నాడు.

సారధి చూపులు మరో వైపుకి తప్పుకున్నాడు.

నిట్టూర్చాడు ఉమాపతి తనలో తనే.

'కాబట్టి సుందరం చెప్పిందాంట్లో అబద్ధమేమీ లేదన్నమాట!

కేవలం తన భ్రమ తొలగటం కోసం భయపడుతున్నాడు.'

"మీరు పెద్దవాళ్ళయి పోయారు. నేను మందలించే దశ కూడా దాటిపోయింది. ఏం చెప్పినా మీకు రుచించదని నాకు తెలుసు. అందుకే చెప్పదలుచుకోలేదు కూడా. రేపు నేనూ, మీ అమ్మా మా దారి వెతుక్కుంటూ వెళ్ళాలను కుంటున్నాము. మమ్మల్ని మీరు అభ్యంతర పెట్టినా ఆగేది లేదు. ఎందుకంటే- మా మాట మీకు లక్ష్యం లేనప్పుడు, మీ మాట వినే అవసరం మాకూ లేదు...." ఆగి గోడమీద క్యాలెండరు కేసి చూశాడు.

'గూడు బయట జాగ్రత్తగా ఉండండ' నే హెచ్చరికలు నిర్లక్ష్యం చేసి, వేటగాడి వలలో చిక్కుకు పోయి ఆక్రందన చేస్తున్న పక్షి పిల్లలకేసి నిస్సహాయంగా చూస్తున్న పెద్ద పక్షులు!

తమ ఇంటి పరిస్థితీ సరిగ్గా అదే!

ప్రమాదకరమయిన ఆకర్షణ లనే వలల్లో చిక్కుకుపోయిన కొడుకూ, కూతురుకీ—ఆ పక్షి పిల్లలకీ తేడా ఏముంది?

ఏమీ లేదు!

ఉమాపతి కళ్ళలోంచి బాధ సెలయేరై ప్రవహించింది. ప్రతి మనిషి జీవితమూ ఓ అందమయిన కల. రేపు అనేది 'ఈనాడు' అనే పునాది మీద నిర్మించే సుందర భవనం.

పునాదే పగిలిపోతే—ఇక భవనం ఎలా కట్టేది?

"మమ్మల్ని క్షమించండి నాన్నా! మీరు చెప్పినట్లే వింటాం! మీకుబాధ కలిగించకుండా నడుచుకుంటాం." పాదాలమీద చేతులువేసి తన మొహంకేసి చూస్తున్న కొడుకూ, కూతురూ!

వాళ్ళ పలుకుల్లో పసితనం.... చిన్ననాటి చేలతనం నిండిన చూపులు. కళ్ళు తుడుచుకున్నాడు ఉమాపతి- వాళ్ళిద్దరి వేపు చూస్తూ.

"నా కోసం కాదర్రా! మీ కోసం, మీ బంగారు భవిష్యత్ కోసం ప్రతి అడుగూ జాగ్రత్తగా వెయ్యాలి. లేకపోతే రెక్కలు విరిగిన పక్షులయిపోతారు. ఎందుకూ పనికిరారు "

ఉమాపతి కంఠం రుద్ధ మయింది. సారధీ, పద్మా అప్రయత్నంగా క్యాలెండరుకేసి చూశారు. ఇన్నాళ్ళకి వాళ్ళకి అందులోని సందేశం అనుభవ పూర్వకంగా అర్థమయింది! ●